సాక్షి
రంగారెడ్డి
గురువారం । 13 । జూన్‌ । 2024


పిల్లలకు స్వాగతం చెబుతున్న టీచర్‌


మాడ్గుల: ఇర్విన్‌ ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు


మహేశ్వరం: విద్యార్థినులకు యూనిఫాం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ అనితారెడ్డి

ప్రారంభించబడి

దాదాపు రెండు నెలల వేసవి సెలవుల అనంతరం రాష్ట్రంలోని పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో మొదటిరోజు (బుధవారం) విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో జోష్‌ కనిపించింది. మెజార్టీ పాఠశాలల్లో విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరైనప్పటికీ.. నూతన విద్యా సంవత్సరానికి అందరూ ఘన స్వాగతం పలికారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు టీచర్లు పూలు అందజేసి స్వాగతం పలికారు. ప్రభుత్వ బడులలో యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందజేయడంతో సందడి వాతావరణం నెలకొంది.

– సాక్షి, నెట్‌వర్క్‌


ఆమనగల్లు: బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

న్యూస్‌రీల్‌

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్‌: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌, జూనియర్‌ కళాశాలలో టీచర్‌ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ విడుదల చేసిందని ప్రిన్సిపాల్‌ శ్రీ వాచ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్‌లోని తెలంగాణ మోడల్‌ స్కూల్‌, కళాశాలలో టీజీటీ, పీజీటీ పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఏడు టీజీటీ (తెలుగు-1, ఇంగ్లీష్‌-1, హిందీ-2, మ్యాథ్స్‌-1, సోషల్‌-1, సైన్స్‌-1) పోస్టులు మరియు 10 పీజీటీ (తెలుగు-2, మ్యాథ్స్‌-2, బాటనీ-2, జువాలజీ-1, సివిక్స్‌-1, కామర్స్‌-1) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు రెండు రోజుల్లో సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. నిర్దేశించిన అర్హతలు, అనుభవం ప్రాతిపదికగా మెరిట్‌ అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం మోడల్‌ స్కూల్‌లో, ఫోన్‌ నం. 99634 25217లో సంప్రదించాలని కోరారు.

సర్వే పనులతో అంగన్‌వాడీలపై పనిభారం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజు, అంగన్‌వాడీ టీచర్లు

కొందుర్గు: మిషన్‌ భగీరథ సర్వే పనుల నుంచి అంగన్‌వాడీ టీచర్లను మినహాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్‌ చేశారు. ఈ విషయమై బుధవారం జిల్లేడ్‌ చౌదరిగూడ తహసీల్దార్‌ జగదీశ్వర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని, వాటికి తోడు సర్వే పనులు అప్పగించడం మరింత భారంగా మారిందని అన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు గోపాల్‌, అంగన్‌వాడీ టీచర్లు ఊర్మిళ, అనసూయ, శోభ, తిరుమలమ్మ, మంగమ్మ, స్వప్న, శోభ, ఇందిర, రాణి, సుగుణ, పద్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయండి

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి


నర్సరీలో ఏర్పాటు చేసిన ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న సీఈఓ కృష్ణారెడ్డి

మంచాల: ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరవేయాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. నోములలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. లింగంపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల, నర్సరీని పరిశీలించారు. మంచాలలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీని సందర్శించారు. నర్సరీలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌ ప్రత్యేక చొరవతో ఫాంపాండ్‌ గోతిని ఏర్పాటు చేసి మొక్కలకు నీటిని సరఫరా చేసే విధానం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హరితహారంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్‌, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రాజ్‌కుమార్‌, శిరీష, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జయానందం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలి


తపస్‌ జిల్లా అధ్యక్షుడు కాశీరావ్‌

ఆమనగల్లు: జిల్లాలో ఆగిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే నిర్వహించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావ్‌ కోరారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభం చేసిన రోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, విద్యుత్‌ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎలాంటి బదిలీలు లేకపోవడంతో జిల్లాలో 13 సంవత్సరాలుగాఉపాధ్యాయులు ఒకేచోట పని చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 32 జిల్లాలతో పాటు మన జిల్లాలో కూడా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో తపస్‌ మండల శాఖ అధ్యక్షుడు మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మన ఆస్పత్రులు సురక్షితమేనా?

జిల్లాలోని ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో కానరాని భద్రతా చర్యలు

- చిన్నచిన్న అపార్ట్‌మెంట్లు, ఇరుకు గదుల్లో నిర్వహణ
- ఆర్‌ఎంపీలు, ఆయుర్వేద వైద్యులతోనే సేవలు
- మార్గదర్శకాలకు తిలోదకాలు
- తనిఖీలను విస్మరించిన అధికారులు
- ఢిల్లీలో జరిగిన ప్రమాదంతోనైనా మేల్కొనేనా?



సాక్షి, రంగారెడ్డిజిల్లా: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదం యావత్‌ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ప్రమాదంలో పలువురు చిన్నారులు మృత్యువాత పడటం అక్కడి వ్యవస్థలోని లోపాలు, వైఫల్యాలను ఎత్తి చూపుతోంది. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తేలింది. ఈ క్రమంలో జిల్లాలోని పలు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లోని రోగుల భద్రతపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది క్రితం వైద్యారోగ్యశాఖ అధికారులు జిల్లాలోని ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చేపట్టిన తనిఖీల్లో.. మెజార్టీ ఆస్పత్రుల్లో అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం వసతులు లేవని గుర్తించి, నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత రాజకీయ నాయకుల ఒత్తిడితో తదనంతర చర్యలు, తనిఖీల జోలికి వెళ్లకుండా అధికారులు మిన్నకుండిపోయారనే విమర్శలున్నాయి.

మార్గదర్శకాలకు తిలోదకాలు..

- క్లినికల్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌ ప్రకారం ప్రతి ఆస్పత్రికి ఫైర్‌ సేఫ్టీ అనుమతి తప్పనిసరి. ఆస్పత్రి ఆవరణలో ఫైర్‌ ఇంజన్‌ చుట్టూ తిరిగే విధంగా రోడ్డు ఉండాలి. బహుళ అంతస్తుల భవనం ఎత్తును బట్టి రెండు గేట్లను ఏర్పాటు చేయాలి. ఏటా మాక్‌ డ్రిల్‌ నిర్వహించి ఆస్పత్రి సిబ్బందికి ఫైర్‌ సేఫ్టీపై అవగాహన కల్పించాలి.
- ఆస్పత్రి యాజమాన్యం ఒక్క బెడ్‌తో చికిత్స అందించినా.. ఆ భవనానికి అగ్నిమాపక శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. క్లినికల్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ యాక్ట్‌ ప్రకారం అగ్నిమాపకశాఖ అధికారులు ఆస్పత్రిని తనిఖీ చేసి, అన్నీ సవ్యంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ)జారీ చేయాలి. కానీ జిల్లాలో ఏ ఒక్క ఆస్పత్రి కూడా నిబంధనల మేరకు లేదు. అగ్నిమాపక శాఖ అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా అడిగినంత ఇస్తే చాలు ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.
- 15 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తులో భవనం ఉంటే విధిగా జీహెచ్‌ఎంసీ, ఆయా మున్సిపాలిటీల నుంచి భవన నిర్మాణ అనుమతులతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ పొందాలి. అదే విధంగా అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. కోట్లాది రూపాయలు వెచ్చించి భవనాలు నిర్మిస్తున్నా.. ఆస్పత్రులు ప్రమాదాల నియంత్రణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.
- ఆస్పత్రిలోని ప్రతి గదిలోకి వెలుతురు ఉండేలా నిర్మించాలి. ప్రమాదాలు నివారించే అన్ని ఉపకరణాలు కొనుగోలు చేయాలి. ఆపత్కాలంలో రోగులు త్వరగా బయటపడేదుకు అనువైన మెట్లు, లిఫ్టులు ఉండాలి. ఆటోమెటిక్‌ స్ప్రింక్లర్స్‌ సిస్టం, స్మోక్‌ డిటెక్షన్‌, వైట్‌ రైర్‌, మాన్యువల్‌ ఆపరేటింగ్‌ అలారం, టెర్రస్‌ ట్యాంక్‌, అండర్‌ గ్రౌండ్‌ వాటర్‌ స్టోరేజీ ట్యాంక్‌, ఎలక్ట్రికల్‌ జాకీ పంపులు అందుబాటులో ఉంచాలి. కానీ మెజార్టీ ఆస్పత్రులు వీటిని ఏర్పాటు చేయడం లేదు. సమకూర్చిన ఆస్పత్రులు కూడా ఆ తర్వాత నిర్వహణను మర్చిపోతున్నాయి.
- మూడు నెలలకోసారి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో ఆస్పత్రిలో ఎవాక్యుయేషన్‌ డ్రిల్‌ (ప్రమాదం జరిగినప్పుడు రోగులను బయటికి తరలించే ప్రక్రియ)ను నిర్వహించాలి.
- వంటగది, క్యాంటీన్‌ ఆస్పత్రి భవనంలో కాకుండా వేరేచోట ఏర్పాటు చేయాలి. కానీ మెజార్టీ ఆస్పత్రులు సెల్లార్లలోనే వంట గదులు, ఇన్‌పేషంట్‌ ఫార్మసీ గోదాంలు, క్యాంటీన్‌ సహా కీలకమైన డయాగ్నోస్టిక్‌ (ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్‌ఐ, రక్తనిధి కేంద్రం, రక్త, మూత్ర పరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌) సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయి.
- భవనంలో అంతస్తుల వారీగా కంపార్ట్‌మెంట్స్‌ ఏర్పాటు చేసి, ఒక బ్లాక్‌ నుంచి మరో బ్లాక్‌కు మంటలు వ్యాపించకుండా చూడాలి. ఆస్పత్రిలో వాడే గ్యాస్‌ నిల్వ చేయడంలో జాగ్రత్త వహించాలి. అత్యవసర ద్వారాలకు తాళాలు వేయకూడదు. బయటికి వెళ్లే మార్గాలపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫర్నీచర్‌, ఇతర వ్యర్థాలను ఆస్పత్రి ఆవరణలో నిల్వ చేయకూడదు. ఎలక్ట్రికల్‌, ఏసీ, ఇతర విద్యుత్‌ ఉపకరణాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

మొత్తంగా మన జిల్లాలోని ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ఏమేరకు భద్రతా చర్యలు తీసుకుంటున్నారో తెలపాల్సిన బాధ్యత ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై ఉంది. అలాగే ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో భద్రతా చర్యలపై తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అలోపతి వైద్యులుగా చలామణి..

జిల్లా వ్యాప్తంగా 3,500కి పైగా ప్రైవేట్‌ ఆస్పత్రులు, నర్సింగ్‌ హోమ్స్‌, ఫెర్టిలిటీ సెంటర్లు, డెంటల్‌, కంటి, ఈఎన్‌టీ క్లినిక్స్‌ ఉన్నాయి. వీటిలో 2,700 ఆస్పత్రులు మాత్రమే వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొందాయి. మిగిలిన వాటికి ఎలాంటి అనుమతులు లేవు. ఇరుకు గదులు, అపార్ట్‌మెంట్లలోని ప్లాట్లను అద్దెకు తీసుకుని ఆస్పత్రులు నిర్వహిస్తున్నాయి. అయితే కొన్ని ఆస్పత్రులు.. ఆయుర్వేద వైద్యులు, ఆర్‌ఎంపీల పర్యవేక్షణలో కొనసాగుతుండగా ఎమర్జెన్సీ విభాగాల్లో సైతం వారే వైద్యం చేస్తుడటం గమనార్హం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లోనూ ఇదే అంశం బయటపడింది. తక్కువ వేతనాలకు పని చేస్తుండటంతో యాజమాన్యాలు కూడా వీరితోనే వైద్య సేవలు అందించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తాత్కాలికంగా తనిఖీలు చేసి.. వారి నుంచి డబ్బులు వసూలు చేసి తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదనే అపవాదు కూడా ఉంది.


షాద్‌నగర్‌ రూరల్‌: దుస్తులు అందజేస్తున్న కలెక్టర్‌ శశాంక, జెడ్పీ చైర్‌పర్సన్‌ అనితారెడ్డి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌

- పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి
- జిల్లా కలెక్టర్‌ శశాంక

షాద్‌నగర్‌ రూరల్‌: విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌ లభిస్తుందని.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్‌ శశాంక సూచించారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని మొగిలిగిద్ద జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకొని.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్‌ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందని అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనేక రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 1,308 ప్రభుత్వ బడుల్లో పునఃప్రారంభం అయిన మొదటి రోజున విద్యార్థులకు యూనిఫాంలతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందించామన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి శ్రీశైలం, డీఈఓ సుశీందర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సీడీపీఓ నామణి, ఎంఈఓ శంకర్‌ రాథోడ్‌, తహసీల్దార్‌ పార్థసారథి, ఎంపీడీఓ బన్సీలాల్‌, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ విజయలక్ష్మి, కాంగ్రెస్‌ నాయకులు.. చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్‌, తిరుపతిరెడ్డి, గ్రామస్తులు,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా బోధన అందిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్‌ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆమె యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్‌, ఎంపీడీఓ శైలజ, మండల విద్యాధికారి కృష్ణ, ఏపీఎం సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాండు నాయక్‌, హర్షగూడ ఎంపీటీసీ విజయ్‌ నాయక్‌, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌ కుమార్‌, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

కలెక్టర్‌ శశాంక


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎస్‌ఎన్‌డీపీ (రాష్ట్ర స్ట్రాటజిక్‌ నాలా డెవలప్‌మెంట్‌ ప్రాజెక్ట్‌) పనులను వేగవంతం చేయాలని కలెక్టర్‌ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌, అధికారులతో కలిసి కలెక్టరేట్‌లో ఎస్‌ఎన్‌డీపీ పనులపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. మీర్‌పేట్‌, బడంగ్‌పేట్‌, జల్పల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని మున్సిపల్‌, రెవెన్యూ, ఇంజనీరింగ్‌ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు కింద జరుగుతున్న పలు కాలువ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రణాళికలు తయారు చేసి అందజేయాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో పనులు జరిగేచోట హెచ్చరిక బోర్డులు, మొబైల్‌, మినీ మొబైల్‌ స్టాక్‌ టీమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌ కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్లు, తహసీల్దార్లు, రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ నివారణపై ప్రత్యేక నిఘా

- ఎక్సైజ్‌ శాఖ అధికారులతో డిప్యూటీ కమిషనర్‌ దశరథ్‌ సమీక్ష
- ఎక్కడికక్కడ గంజాయి, నకిలీ మద్యాన్ని అరికట్టాలని ఆదేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: డ్రగ్స్‌ నివారణపై మరింత నిఘా పెంచాలని జిల్లా డిప్యూటీ కమిషనర్‌ పి.దశరథ్‌ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆబ్కారీ భవన్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎక్సైజ్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం, ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌ ఆదేశాల మేరకు హైదారాబాద్‌ సహా రంగారెడ్డి జిల్లాలో డ్రగ్స్‌ వినియోగం, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. డ్రగ్స్‌ పెడ్లర్స్‌పై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాన్‌ డ్యూటీ లిక్కర్‌(నకిలీ మద్యం)ను సీజ్‌ చేయాలని చెప్పారు. కల్తీ కల్లు వినియోగంపై కూడా ఎప్పటికప్పుడు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా పరిధిలోని ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్లలో ఏళ్ల క్రితమే పట్టుకొని నిల్వ చేసిన సామగ్రిని ధ్వంసం చేయడానికి సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలని అన్నారు. కేసులు నమోదు చేయడంతో పాటు సంబంధిత కేసుల్లో చార్జిషీట్స్‌ వేసి నిందితులకు శిక్ష పడే విధాంగా చర్యలు చేపట్టాలన్నారు. పట్టుకున్న గంజాయి సీహెచ్‌, బెల్లం, డ్రగ్స్‌, నాటుసారా, లిక్కర్‌ను ధ్వంసం చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలని అదేశించారు. ఈ విషయంలో పోలీస్‌ స్టేషన్లను తనిఖీ చేసి వారంలో రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఏఈఎస్‌లకు సూచించారు. వివిధ స్టేషన్లలో ఉన్న వాహనాలకు సంబంధించి ఎప్పటికప్పుడు వాటి యజమానులకు నోటీసులు ఇస్తూ వాహనాలను తీసుకొనిపోయే విధాంగా చర్యలు చేపట్టాలని, తీసుకెళ్లని పక్షంలో వాహనాలను వేలం వేయాలన్నారు. 427 వాహనాలు వివిధ స్టేషన్లలో ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయని వీటికి సంబంధించి నోటీసుల అనంతరం వెంటనే వేలం వేయాలని అన్నారు. లైసెన్స్‌ ఫీజుల వసూళ్లతో పాటు బకాయిలు కూడా కట్టించాలని సూచించారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ కిషన్‌, మల్కాజిగిరి ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ నవీన్‌ కుమార్‌, డీపీఈఓలు విజయ భాస్కర్‌ గౌడ్‌, కృష్ణప్రియ, ఉజ్వలరెడ్డి, ఏఈఎస్‌లు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

జీవితాలను నాశనం చేసుకోవద్దు..

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్‌ బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏసీపీ కేపీవీ రాజు విద్యార్థులకు సూచించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్‌ విద్యాసంస్థలో బుధవారం నిర్వహించిన యాంటీ డ్రగ్స్‌ అబ్యూజ్‌ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు బానిసలైన వారి భవిష్యత్‌ అంధకారంగా తయారవుతుందని, కుటుంబానికి, సమాజానికి ఎంతో నష్టం కలుగుతుందన్నారు. మానసికంగా పూర్తిగా కృంగిపోతారన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా, డ్రగ్స్‌కి బానిసైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ సత్యనారాయణ, గురునానక్‌ విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్‌


వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన బీసీ జనసభ నాయకులు

ఆమనగల్లు: మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీ కులగణన చేయడంతో పాటు స్థానిక సంస్థలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే.. 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్‌ డిమాండ్‌ చేశారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో.. ఈనెల 15న హైదరాబాద్‌ ఇందిరాపార్క్‌ వద్ద బీసీ జనసభ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. జనసభలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ జనసభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్‌, నాయకులు.. కుమార్‌, శ్రీనివాస్‌, రఘు, కృష్ణ, సైదులు గౌడ్‌, ఆనంద్‌, రాఘవేందర్‌, మురళి, ఎల్లప్ప, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

అల్లిచెరువు పరిరక్షణకు వినతి

- మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహా
- మంచాల తహసీల్దార్‌కు అర్జీ అందజేత


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సింహా, నాయకులు

మంచాల: ఆగాపల్లి రెవెన్యూ పరిధిలోని అల్లిచెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహా డిమాండ్‌ చేశారు. బుధవారం ఆగాపల్లి రెవెన్యూ పరిధిలోని అల్లి చెరువు, సాయబందం చెరువు, జన్కాన్‌ చెరువులను ఆయన సందర్శించారు. అనంతరం మంచాల తహసీల్దార్‌ వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నర్సింహా మాట్లాడుతూ.. ఆగాపల్లి రెవెన్యూ పరిధిలోని కాగజ్‌ఘాట్‌ సమీపంలోని ఓ ప్రైవేట్‌ వెంచర్‌ యాజమాన్యం అల్లి చెరువును అక్రమంగా కబ్జా చేసిందన్నారు. చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్‌ హద్దురాళ్లను తొలగించడంతో పాటు, ఎఫ్‌టీఎల్‌ పరిధిలో మట్టిపోసి సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీల నిర్మాణం చేపట్టిందన్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మంచాల మండలంలో చెరువులు కబ్జాకు గురవుతుంటే ఇరిగేషన్‌ అధికారులు ఏమి చేస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో చెరువులో అక్రమంగా నాటిన కడీలను తొలగించారు. దీంతో ప్రైవేట్‌ వెంచర్‌ యాజమాని అక్కడికి చేరుకొని.. తమకు ఇరిగేషన్‌ అధికారులు ఎన్‌ఓసీ సర్టిఫికెట్‌ ఇచ్చారని చెప్పారన్నారు. తప్పుడు ఎన్‌ఓసీ జారీ చేసిన అధికారులపై ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కబ్జాకు గురైన చెరువులను కాపాడాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌, స్థానిక సొసైటీ అధ్యక్షుడు నర్సింహా, సంఘం మండల ప్రధాన కార్యదర్శి పాపయ్య, డైరెక్టర్లు నాగరాజు, పరమేష్‌, దానయ్య, రమేష్‌, జగన్‌, కుమార్‌ దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జల్‌పల్లి తైబజార్ వేలం
రూ.9.90 లక్షలు పలికిన వైనం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ తైబజార్ వేలం రూ.9.90 లక్షలుగా పలికింది. మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాధి అధ్యక్షతన కమిషనర్ వాణిరెడ్డి సమక్షంలో బుధవారం నిర్వహించిన వేలంలో ఒకే ఒక్క ఔత్సాహికుడు షేక్ అమేర్ ముందుకు రావడంతో గతేడాది కంటే 10 శాతం ఎక్కువ రుసుంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తైబజార్ దక్కించుకున్నవారు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు వీధి వ్యాపారుల వద్ద రుసుంలను వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాము సూచించినంత మేరకే వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయాలన్నారు. ఈ ఏడాదిలో ఎన్నికల కోడ్ కారణంగా ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన వేలం పాటను ఇప్పుడు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో సుదర్శన్, మేనేజర్ నిర్మల, కౌన్సిలర్ లక్ష్మీనారాయణతో పాటు అలీ మసూరీ అలీ, బర్కత్ అలీ, దూడల శ్రీనివాస్ గౌడ్, నవీన్ గౌడ్, శివ పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ
రాజేంద్రనగర్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డెయిరీ ఫాం చౌరస్తా వద్ద బుధవారం స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. రవాణా శాఖ అధికారిని ఉపాసిని ఆధ్వర్యంలో ఫిట్‌నెస్, బీమా, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ కిట్ లేని వాటిని గుర్తించి 17 బస్సులను సీజ్ చేశారు.

వేతనాలు అందక.. వెతలు తీరక


చెత్తను సేకరిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

- మూడు నెలలుగా నిలిచిన జీతాలు
- తీవ్ర అవస్థల్లో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నందిగామ: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని జాతిపిత మహాత్మా గాంధీ ఆనాడే పేర్కొన్నారు. గ్రామాభివృద్ధే, దేశాభివృద్ధి అని ప్రజాస్వామ్యవాదులు చాలా సందర్భాల్లో విశ్లేషించారు. అలాంటి గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే కాకుండా పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి. కానీ మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి కార్మికులకు జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో సమయానికి వేతనాలు రాక తీవ్ర ఇక్కట్లు శ్రమజీవులు పడుతున్నారు. నందిగామ మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఇటీవల అంతిరెడ్డిగూడను సైతం జీపీగా ఏర్పాటు చేశారు. దీంతో మండలంలో గ్రామ పంచాయతీల సంఖ్య 19కి చేరుకుంది. ఆయా గ్రామ పంచాయతీలలో 108 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి మూడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు.

అల్లాడిపోతున్నాం..

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్మికులపై ఒత్తిడి చేస్తుంటారు. వాటిని తట్టుకొని మురుగు కాల్వలతో పాటు, చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుంటారు. గ్రామంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందే కీలకం. అలాంటి సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు లేక అల్లాడిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 19 గ్రామ పంచాయతీలో కొన్ని గ్రామాలు మినహా అధిక గ్రామ పంచాయతీలలో వేతనాలు అందడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో తమ పిల్లలకు దుస్తులు, పుస్తకాలు తదితర వాటిని తీసుకునేందుకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వెలిబుచ్చుతున్నారు. దీనికి తోడు అనారోగ్యాలకు గురైతే కనీసం మందులు కొనుగోలు చేసేందుకు సైతం డబ్బులు లేవని దీనస్థితిని వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ చెక్కులు ఎస్టీఓలో చెల్లుబాటు కాలేకపోవడం, 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో రాకపోవడంతోనే గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు సకాలంలో అందించలేక పోతున్నామని ఉన్నతాధికారులు చేతులు దులుపుకొంటున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పూట గడవడం లేదు



మూడు నెలలుగా వేతనాలు లేక అల్లాడిపోతున్నాం. నెల నెల జీతాలు వస్తేనే తమ కుటుంబం పూట గడవడం కష్టం. అలాంటిది ఇన్ని రోజులుగా వేతనాలు లేకపోతే తాము ఎలా బతుకుతాం. గ్రామంలో ఎక్కడైనా పారిశుద్ధ్యం కొరవడితే చాలు తమ సేవలను వాడుకుంటారు. కానీ సకాలంలో వేతనాలు మాత్రం ఇవ్వట్లేదు.

– పెద్ద జంగమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు, నర్సప్పగూడ

అప్పులు చేస్తున్నాం



వేతనాలు రాకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తుంది. దీంతో పాటు నిత్యవసర సరుకులను అరువుకు తెచ్చుకుంటున్నాం. దుకాణాదారులకు కొంత కాలంగా డబ్బులు ఇవ్వకపోవడంతో సరుకులు నిలిపి వేశారు. ఇలా అయితే ఏ విధంగా బతకాలి. అధికారులు తక్షణమే స్పందించి వేతనాలను చెల్లించాలి.

– పోచయ్య, పారిశుద్ధ్య కార్మికుడు, నందిగామ

నిధులు రావట్లేదు

కొన్ని గ్రామ పంచాయతీలలో కార్మికులకు వేతనాలు చెల్లించాం. మరికొన్ని జీపీల్లో జీతాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. 15వ ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో వేతనాలు చెల్లించడంలో కొంత జాప్యం జరిగింది. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి, కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు కృషి చేస్తా.

– శ్రీనివాస్, ఎంపీఓ, నందిగామ


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అధికారుల నిర్లక్ష్యంతోనే జాప్యం

- హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులపై నేతల మండిపాటు
- గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు అనడం హాస్యాస్పదమని వెల్లడి

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యానికి అధికారులు, కాంట్రాక్టర్ మెగా ఇంజనీరింగ్ సంస్థ నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి ఆరోపించారు. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు జాప్యం ఎందుకు జరుగుతుందని నేషనల్ హైవే అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. రోడ్డు పక్కన ఉన్న మర్రి చెట్ల తొలగింపుపై గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి కోసం ఇన్ని రోజులు ఆలస్యమైందని పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. చెట్ల తొలగింపుపై ఎంత నష్టం జరుగుతుందని ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థకు లాభం చేకూర్చేలా అధికారులు కుమ్మక్కై రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. చెట్ల సాకుతో పనుల్లో నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2018లోనే ఈ రోడ్డును జాతీయ రహదారి విస్తరణ కిందికి ఎంపిక చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు రూ.100 కోట్లకు పైగానే భూసేకరణకు కేటాయించాయి. సదరు కాంట్రాక్టర్‌కు అప్పగించినా పనులు చేయకుండా గ్రీన్ ట్రిబ్యునల్‌లో వేసిన కేసును సాకుగా చూపుతున్నారన్నారు.

ముఖ్యమంత్రిని కలుస్తాం

రోడ్డు విస్తరణపై కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని త్వరలోనే కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. ఈ రోడ్డుపై నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంతో మంది చనిపోతున్నారన్నారు. తప్పకుండా కాంగ్రెస్ పార్టీ హయాంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆగిరెడ్డి, పెంటయ్యగౌడ్, వీరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు, రమేశ్, బాలయ్య, నర్సింలు, రాంరెడ్డి, మానిక్యం తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 23 గొర్రెల మృత్యువాత


గొర్రెల కళేబరాల వద్ద బాధితుడు

ఇబ్రహీంపట్నం: ఊర కుక్కల దాడిలో 24 గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన ఇబ్రహీంపట్నంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఫిర్జాదిమహీల్‌కు చెందిన ఎస్‌డీ యాజాజ్‌కు ఇంటి సమీపంలో గొర్రెల షెడ్ ఉంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కుక్కలు జీవాల మందపై పడ్డాయి. ఈ ఘటనలో 23 జీవాలు మృతిచెందగా.. మరో మూడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా పరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

11 క్వింటాళ్ల బియ్యం పట్టివేత
యాచారం: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రాచకొండ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో గురుప్రసాద్ అనే వ్యాపారి ఇంట్లో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు రాచకొండ ఎస్ఓటీ పోలీసులు బుధవారం ఉదయం గురుప్రసాద్ ఇంట్లో తనిఖీలు చేయగా 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యాచారం పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం


అంకంరావ్ (ఫైల్)

పహాడీషరీఫ్: పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..తుక్కుగూడ గ్రామానికి చెందిన అంకం రావ్ (34) 20 రోజుల క్రితం పని నిమిత్తం బైక్‌పై అల్వాల్‌కు వెళ్లాడు. ఈ నెల 7వ తేదీన భార్య నాగశేషమ్మకు ఫోన్ చేసి మాట్లాడాడు. అనంతరం అతని ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పని దగ్గరికి వెళ్లి అడగడంతో ఇంటికి వెళుతున్నానని నాలుగు రోజుల క్రితం చెప్పి వెళ్లాడని తోటి కార్మికులు తెలిపారు. దీంతో నాగశేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

నిర్మాణాలకు సరైన ఎంపిక 'భారతి'
సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ బద్రి



తాపీమేస్త్రీల సమావేశంలో పాల్గొన్న భారతి సిమెంట్ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ బద్రి తెలిపారు. పెద్దఅంబర్‌పేటలోని స్టీల్ హౌస్ డీలర్ షాప్‌లో బుధవారం రాత్రి తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ఇది ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. డీలర్లు లింగస్వామి, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్స్ షాహెర్, నర్సింహులు, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

లైటింగ్ ఏర్పాటు.. వివాదాస్పదం

- తీర్మానం లేకుండానే రూ.12 లక్షలు ఖర్చు చేసిన బడంగ్‌పేట్ మున్సిపల్ అధికారులు



రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన లైటింగ్ (ఫైల్)

బడంగ్‌పేట్: ఎలాంటి తీర్మానం చేయకుండా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.12 లక్షలు ఖర్చు చేయడం వివాదాస్పదంగా మారింది. గతంలో కార్పొరేషన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాన్ని మూడు రోజులు ఘనంగానే నిర్వహించారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత బడంగ్‌పేట్ కమాన్ నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు మూడు రంగుల జెండా కలర్‌లో లైట్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు రూ.12 లక్షలు కేటాయించి ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీనిపై ఎలాంటి తీర్మానం చేయకుండా మున్సిపల్ అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా రూ.లక్షకు పైగా నగదు డ్రా చేయాలంటే మున్సిపల్ పాలక సభ్యులతో కూడిన తీర్మానం అవసరం. అలాంటిది ఎవరికీ తెలియకుండా విద్యుత్ లైట్ల పేరుతో ప్రజా ధనాన్ని ఖర్చు చేయడం ఎంత వరకు సబబు అనిస్థానికులు ప్రశ్నిస్తున్నారు.దీనిపై వివరణ కోరేందుకు బడంగ్‌పేట్ కమిషనర్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

చర్యలు తీసుకోకపోతే ముట్టడిస్తాం



అధికారులు, పాలకులకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఎవరిచ్చారు? సమస్యలతో వందల కాలనీలు సతమతం అవుతుంటే అవి తీర్చకుండా రూ.12 లక్షలు ఎలా ఖర్చు చేస్తారు? అనుమతులు లేకుండా ప్రజలు కట్టిన సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న అధికారులను అందుకు ప్రోత్సహిస్తున్న పాలకులపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే బీజేవైఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– రామకృష్ణారెడ్డి, బీజేవైఎం, కార్పొరేషన్ అధ్యక్షుడు

జాతీయ స్థాయి నంది అవార్డు గ్రహీతకు సన్మానం


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న బండారి రమేశ్

షాద్‌నగర్‌రూరల్: జాతీయ స్థాయి బంగారు నంది అవార్డును అందుకున్న శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం శ్రీవాణి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్ సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. పట్టణంలోని జియోన్ ఎయిడెడ్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి కొన్ని దశాబ్దాలుగా నాటక రంగంలో అనేక పాత్రలు పోషిస్తూ సామాజిక చైతన్యాన్ని తీసుకువస్తున్నారని అన్నారు. ఆయన సేవలను గుర్తించిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ హైదరాబాద్ జాతీయ స్థాయిలో బంగారు నంది అవార్డుకు ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. సాంస్కృతిక సంస్థ సభ్యులు మనోహరాచారి, కేఎల్ కన్నా, గోపాల్‌రెడ్డి, పరందాములుగౌడ్, కుమార్, ప్రభులింగం, విద్యాసాగర్‌రెడ్డి, సురేందర్, వెంకటేశ్, రఘురాంచారి, సురేశ్, గౌరీశంకర్, గణేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తాం


అంగన్‌వాడీలకు మెడికల్ కిట్లు, చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం యాచారం, మంచాల మండలాలకు చెందిన 44 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, అంగన్‌వాడీ ఆశ వర్కర్లకు చీరలు, మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని.. వారు చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీని రేవంత్ సర్కార్ చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, రెండు లక్షల రైతు రుణమాఫీ, పేదింటి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మికి అదనంగా మరో తులం బంగారం, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలను త్వరలో ప్రభుత్వం అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి పద్మజారమణ, ఆర్డీఓ అనంత రెడ్డి, సీడీపీఓ శాంతిశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ బర్ల మంగ, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, తహసీల్దార్లు సునీత, అయ్యప్ప, వెంకటప్రసాద్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ జర్దా స్థావరంపై దాడులు

- 18 కిలోల విడి జర్దా, సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎస్ఓటీ పోలీసులు


నకిలీ జర్దా ప్యాకెట్లతో పట్టుబడిన నిందితులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ జర్దా తయారీ కంపెనీపై మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. నిర్వాహకుడితో పాటు ఇద్దరు కార్మికులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాదే ఉమర్ కాలనీలో పాతబస్తీ ఫలక్‌నుమాకు చెందిన సయ్యద్ ఇర్ఫాన్(45) గత కొన్ని రోజులుగా ఎం–గోల్డ్ కంపెనీకి చెందిన జర్దా ముసుగులో నకిలీ జర్దా తయారు చేస్తున్నాడు. యూపీకి చెందిన ఇద్దరు కార్మికులు హరిశంకర్ రాజ్‌పుత్(29), విక్రంసిన్హ పర్మార్(30)లను కార్మికులుగా పెట్టుకొని ఈ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి నిర్వాహకుడితో పాటు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 18 కిలోల విడి జర్దా, ఒక కిలో పుదీనా, రెండు కిలోల హిమాం లిక్విడ్, నాలుగు రోజ్ వాటర్ బాటిళ్లు, 46,560 జర్దా ప్యాకెట్లు, ఎం గోల్డ్ రెండు రోలర్స్, నాలుగు కాటన్ల ఎం గోల్డ్ ఖాళీ బాక్సులు, తయారీ యూనిట్, తూకం, రెండు వేడి చేసే మిషన్లు, రెండు కిలోల ప్లాస్టిక్ ప్యాకింగ్ కవర్లు, ఒక హోండా యాక్టివా, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.